డోలాయమానం ఆర్టీసీ విలీనం

నేడు క్యాబినెట్ సమావేశం

- శరతులతో అనుమతి ఇచ్చిన ఎన్నికల కమిషన్
- మధ్యాహ్నం 3 గంటల నుంచి క్యాబినెట్ సమావేశం

హైదరాబాద్, మే 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర క్యాబినెట్ సమావేశానికి కేంద్ర ఎన్నికల సంఘం ఆదివారం షరతులతో కూడిన అనుమతి ఇచ్చింది. దీంతో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు సమావేశాన్ని నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. సమావేశంలో చర్చించాల్సిన అంశాలపై కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టమైన సూచనలు చేసింది. జూన్ 4వ తేదీ వరకు వేచి చూసే అవకాశం లేని అత్యవసర అంశాలపై మాత్రమే చర్చించి, నిర్ణయాలు తీసుకోవచ్చని పేర్కొన్నది. హైదరాబాద్ ఉమ్మడి రాజధాని, రైతు రుణమాఫీ అంశాలను ఎన్నికల కోడ్ ముగిసే వరకు వాయిదా వేయాలని ఆదేశించింది. ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములైన అధికారులెవరినీ క్యాబినెట్ సమావేశానికి పిలువొద్దని సూచించింది. ఈ నేపథ్యంలో క్యాబినెట్‌లో ధాన్యం కొనుగోళ్లు, వానకాలం పంటల ప్రణాళిక, తెలంగాణ ఆవిర్భావ వేడుకల నిర్వహణ, జూన్ నుంచి విద్యాసంస్థలు తెరిచేందుకు ప్రణాళిక వంటి అంశాలకే పరిమితం అయ్యే అవకాశమున్నది.

'బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించాలి'

హైదరాబాద్, మే19 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కులగణన నిర్వహించి, బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని, అనంతరం స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని ఎంబీసీ సంఘాల సమితి జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కులగణన నిర్వహించకుండానే, బీసీ రిజర్వేషన్ల స్థిరీకరణ అంశం తేల్చకుండానే రాష్ట్రప్రభుత్వం జూన్ నెలాఖరులోనే ఎన్నికలు ఉంటాయని ప్రకటిస్తుండడంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బీసీలు, ఎంబీసీలను కాంగ్రెస్ మరోసారి మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే కులగణన చేపట్టాలని కోరారు. 42శాతం రిజర్వేషన్లను కల్పించకపోతే ఉద్యమించక తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

మొదటిపేజీ తరువాయి...

కాంగ్రెస్ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. విలీన ప్రక్రియకు గత ప్రభుత్వం నియమించిన ఉన్నతస్థాయి అధికారుల కమిటీ నివేదిక ఆధారంగా విధివిధానాలను ప్రస్తుత ప్రభుత్వం ఖరారు చేయాల్సి ఉన్నది. ఆర్టీసీ విలీన ప్రక్రియ పూర్తయితే సంస్థపై జీతాల భారం పూర్తిగా తొలగనున్నది. కేవలం ప్రభుత్వ ఖజానాపై భారం పడుతుందనే ఉద్దేశంతోనే ఈ ప్రక్రియను పక్కకు పెట్టిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. వేతన సవరణ బకాయిల చెల్లింపునకే ఈ ప్రభుత్వం కిందామీదా పడుతున్నదని, ఈ తరుణంలో ఆర్టీసీ ఉద్యోగుల జీతాల భారాన్ని తలపైకెత్తుకోవడం ఎందుకన్న ఉద్దేశంతో దాన్ని పక్కన పెట్టిందన్న చర్చ సాగుతున్నది. సంస్థ విలీన ప్రక్రియ అంశాన్ని ఎన్నిసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా స్పందన కరువైందని ఆర్టీసీ ఉద్యోగ సంఘాలు వాపోతున్నాయి.

ప్రయోజనాలు కోల్పోతున్న వందలాది మంది ఉద్యోగులు

ఆర్టీసీ విలీనమైతేనే సంస్థ ఉద్యోగులు పీఆర్సీ పరిధిలోకి వస్తారు. జీతాలు కూడా కాస్త అటూ ఇటుగా ప్రభుత్వ ఉద్యోగుల దరికి చేరుతాయి. అయితే విలీన ప్రక్రియ కాలయాపన జరిగే కొద్దీ, పదవీ విరమణ పొందే ఆర్టీసీ ఉద్యోగులు ఆ ప్రయోజనాలకు దూర

మవుతున్నారు. ప్రక్రియ పూర్తయిన తర్వాత నుంచి ఇప్పటివరకు 1,800 మంది ఉద్యోగ విరమణ పొందారు. మరో రెండు నెలల్లో 300 మందికిపైగా విరమణ పొందుతారు. ప్రభుత్వ ఉద్యోగిగా పదవీ విరమణ పొందితే ప్రత్యేక ఆర్థిక ప్రయోజనాలు ఉంటాయని ఆశపడుతున్నారు. వారి ఆశలను కాంగ్రెస్ సర్కారు నీరుగారుస్తున్నది. ప్రభుత్వం తీరు పట్ల ఆర్టీసీ ఉద్యోగుల్లో రోజురోజుకు ఆగ్రహం పెరుగుతున్నది.

ఆర్టీసీకి ఊపిరిలూదిన కేసీఆర్

తీవ్ర ఆర్థిక కష్టనష్టాలతో దివాలా దిశలో ఉన్న టీఎస్ఆర్టీసీని 2023 ఆగస్టులో ప్రభుత్వంలో విలీనం చేసి ఆనాటి సీఎం కేసీఆర్ సంస్థకు ఊపిరి లూదారు. సెప్టెంబర్ మొదటివారంలో బిల్లుపై గవర్నర్ ఆమోదముద్ర వేయడంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఆర్టీసీ ఉద్యోగులు ప్రభుత్వ ఉద్యోగులుగా మారినట్టయింది. దీంతో దాదాపు 43,373 మందికి ఉద్యోగ భద్రత దొరికినట్లయింది. ఈ ప్రక్రియను పూర్తిచేస్తే సంస్థలోని ఉద్యోగులకు పింఛన్ సదుపాయం సైతం లభించనున్నది. ఆర్టీసీ ఉద్యోగులుగా ఉన్న సిబ్బంది మొత్తం రాష్ట్ర ప్రజారవాణా శాఖ ఉద్యోగులుగా మారుతారు.

కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం

అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఆర్టీసీ విలీన ప్రక్రియ నిలిచింది. డిసెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. అప్పటికే 90 శాతం పూర్తయిన విలీన ప్రక్రియపై కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం ఆ ఊసెత్తకపోవడంతో ఆర్టీసీ కార్మికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. విధివిధానాల రూపకల్పనకు ఏర్పాటుచేసిన కమిటీలోని చాలా మంది ఐఏఎస్ అధికారులు ఆయా స్థానాల నుంచి బదిలీ అయ్యారు. ప్రభుత్వం మారడంతో కొత్త కమిటీని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. కానీ ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించడమే లేదనే ఆర్టీసీ కార్మికులు మండిపడుతున్నారు.

ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పేస్కేల్

ప్రభుత్వంలో విలీనం పూర్తయితే పభుత్వ ఉద్యోగుల పీఆర్సీ ప్రకారం స్కేల్‌ను వర్తింపజేసే అవకాశం ఉన్నది. ఆర్టీసీలోని శ్రామిక్, అటెండర్, డ్రైవర్, కండక్టర్ మొదలుకొని మేనేజర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఇలా సంస్థలోని అన్ని పోస్టులను ప్రభుత్వంలోని తత్సమాన పోస్టుల్లోకి మారుస్తారు. సిబ్బంది ఆర్టీసీలో చేరిన సంవత్సరం ఆధారంగా పింఛన్ విధానాన్ని ఖరారు చేస్తారు. విలీనం పూర్తయితే ఉద్యోగులతో సమానంగా ప్రతి ఐదేండ్లకోసారి పీఆర్సీ ద్వారా జీతాల పెంపు ఉంటుంది.

కొత్త కమిటీని ఏర్పాటు చేయాలి

ఆర్టీసీ సంస్థ విలీన ప్రక్రియ 90 శాతం పూర్తయింది. విధి విధానాలకు గత ప్రభుత్వం ఏర్పాటుచేసిన కమిటీ రద్దయిన నేపథ్యంలో ఈ సర్కారు కొత్త కమిటీని ఏర్పాటు చేయాలి. దాని నుంచి నివేదిక తెప్పించుకొని ఆ నివేదిక ప్రకారం అమలుచేయాలి. ఆర్టీసీ ఉద్యోగుల జీతాలను వెంటనే పెంచాలి. ఆదుకుంటామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన తన మాటను నిలబెట్టుకోవాలి. – యాదయ్య, టీఎంయూ నేత

ఆర్టీసీ కార్మికులను మోసగించడమే..

ఎన్నికల ముందు ఆర్టీసీకి అన్ని వేళలా అండగా ఉంటామని కాంగ్రెస్ చెప్పడంతో నమ్మాం. ఆ పార్టీకి ఆర్టీసీ కార్మికులు అండగా నిలిచారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉద్యోగుల సమస్యలను పట్టించుకోవడమే లేదు. 90 శాతం పూర్తయిన ప్రక్రియపై చర్చించకపోవడం ఆర్టీసీ కార్మికులను మోసగించడమే. ఇప్పటికైనా విలీనం పూర్తి చేసి ఆర్టీసీ ఉద్యోగులకు న్యాయం చేయాలి.

– ఏవీఎస్ రెడ్డి, టీఎంయూ నేత

వేయికండ్లతో ఎదురుచూస్తున్నాం

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలి.దీని కోసం ఉద్యోగులు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. 90 శాతం పూర్తయిన ప్రక్రియను ముగించాలి. విలీన ప్రకటన వెలువడినప్పటి నుంచి ఇప్పటికే 1,800 మంది ఉద్యోగులు విరమణ పొందారు. ఆగస్టులోగా మరో 300 మంది వరకు ఉద్యోగాల నుంచి రిటైరవుతారు. వీరందరికీ ప్రయోజనాలు అందలేదు.

– థామస్‌రెడ్డి, టీఎంయూ నేత

ఎండా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	42.0°c	26.0°c
ఆదిలాబాద్	41.5°c	21.5°c
నల్లగొండ	40.7°c	24.1°c
మహబూబ్‌నగర్	39.6°c	28.2°c
మెదక్	38.0°c	23.6°c
నిజామాబాద్	37.4°c	26.8°c
రంగారెడ్డి	36.6°c	21.3°c
వరంగల్	33.0°c	27.0°c
కరీంనగర్	32.0°c	28.0°c
హైదరాబాద్	31.0°c	27.0°c



అండమాన్‌ను తాకిన రుతుపవనాలు

- 31న కేరళలో, జూన్ మొదటివారంలో ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశించే అవకాశం
- ఎల్లుండి బంగాళాఖాతంలో అల్పపీడనం!
- తెలుగు రాష్ట్రాలకు భారీ వర్ష సూచన
- తెలంగాణలో మూడురోజులు వానలు
- భారత వాతావరణ శాఖ ప్రకటన

హైదరాబాద్, మే 19 (నమస్తే తెలంగాణ): ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు ఆదివారం అండమాన్ తీరాన్ని తాకాయి. ఈ నెల 31న కేరళలో, జూన్ మొదటివారంలో ఏపీలో అవి ప్రవేశించే అవకాశం ఉన్నది. ఈ నెల 22న బంగాళాఖాతంలో ఏర్పడే అల్పపీడనం, 24 నాటికి వాయుగుండంగా మారే అవకాశం ఉన్నట్టు భారత వాతావరణశాఖ తెలిపింది. ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణ, రాయలసీమ మీదుగా ద్రోణి ప్రభావంతో కోస్తా, రాయలసీమలో పలు చోట్ల వర్షాలు కురుస్తాయని, కొన్నిచోట్ల పిడుగులతో కూడిన వానలు పడవచ్చని పేర్కొన్నది. దక్షిణ అండమాన్ ఆగ్నేయ బంగాళాఖాతం, నికోబార్ దీవుల్లో రుతుపవనాలు విస్తరిస్తున్నాయి. వాస్తవానికి దక్షిణ అండమాన్ సముద్రానికి రుతుపవనాలు 22న చేరుకోవాల్సి ఉండగా, మూడు రోజుల ముందే చేరాయి. జూన్ 1న రుతుపవనాలు కేరళలో ప్రవేశించి జూలై 15 కల్లా దేశవ్యాప్తంగా విస్తరిస్తాయి. గత ఏడాది ఎల్‌నినో ప్రభావానికి తోడు బిపర్‌జాయ్ తుఫాను కారణంగా నైరుతి రుతుపవనాలు ఆలస్యంగా ప్రవేశించాయి. రెండు వారాలు ఆలస్యంగా కేరళలోకి ప్రవేశించడంతో సీజన్ కూడా ఆలస్యంగా మొదలైంది. కానీ, ఈ సారి నైరుతి రుతుపవనాలు సాధారణ సమయానికే వస్తుండటంతో జూన్ 1 కల్లా కేరళ మీదుగా దేశంలోకి ప్రవేశించనున్నాయి. రుతుపవనాల రాకతో ఈ ఏడాది జూన్ నుంచి సెప్టెంబర్ మధ్య సాధారణం కంటే కాస్త ఎక్కువగా వర్షాలు కురుస్తాయి. తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే వర్షాలు పడుతున్నాయి.

మరో మూడు రోజులు వర్షాలు

రాష్ట్రంలో మూడురోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీచేసింది. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, వికారాబాద్, మెదక్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, ఉరుములు, మెరుపులతో వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వెల్లడించింది. సోమవారం తెలికపాటి నుంచి మోస్తరు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నట్టు పేర్కొంది. 22న భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో వానలు పడవచ్చని తెలిపింది. 23న ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉన్నదని వివరించింది. ఆదివారం వికారాబాద్, సంగారెడ్డితోపాటు పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిశాయని వెల్లడించింది.

ఫ్రీ బస్సులో పగిలిన ముక్కు



మహబూబాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో సీట్ల కోసం ప్రయాణికులు కొట్టుకున్న ఘటన ఆదివారం చోటుచేసుకుంది. తిరుమల వెంకన్న దర్శనానికి వెళ్లిన భక్తులు తిరుగు ప్రయాణంలో మహబూబాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సులో సీట్ల కో సం కొట్టుకోగా ఒకరి ముక్కు పగిలి తీవ్రగాయాలయ్యాయి. తెలంగాణలో ఫ్రీ బస్సుతో ఎనలేని పాట్లు పడుతున్నామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతి వెంకన్న ఉచిత దర్శనం సునాయాసంగా కలిగినా, తెలంగాణలో ఫ్రీ బస్సులతో సీట్లు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. ప్రయాణికులకు సరిపడా బస్సులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. – మహబూబాబాద్ రూరల్

'హరిత' చెట్లపై గొడ్డలి వేటు



మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం నుంచి నెల్లికుదురు ఆకేరు వాగు వరకు రోడ్డుకిరువైపులా అటవీ శాఖాధికారులు హరితహారం కింద మొక్కలు నాటారు. ప్రస్తుతం అవి పెద్దవి కావడంతో కరెంటు తీగలకు అడ్డొస్తున్నాయని ఆదివారం విద్యుత్తు శాఖ అధికారులు కొమ్ములవంచ సబ్‌స్టేషన్ నుంచి ఆకేరు వాగు వరకు చెట్లను గొడ్డండ్లతో నరికేశారు. దీనికి తోడు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మండలంలోని రామన్నగూడెం శివారు నుంచి సబ్‌స్టేషన్ వరకు రోడ్డు పక్కన ఉన్న చెట్లు కాలిపోయాయి. –నర్సింహులపేట

హరిత భవనాల నిర్మాణాన్ని ప్రోత్సహిస్తాం

- గ్రీన్ ప్రాపర్టీషో ముగింపు వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టి

కొండాపూర్, మే 19: రాష్ట్రంలో హరిత భవనాల నిర్మాణాన్ని ప్రోత్సహిస్తామని, ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారాన్ని అందజేస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. కనీసం 50% నీటిని, 40% విద్యుత్తును ఆదా చేయగలిగేలా హరిత భవనాలను నిర్మించాలని, సామాన్యులు సైతం కొనుగోలు చేయగలిగేలా ఆ భవనాలు ఉండాలని అన్నారు. ఆదివారం ఆయన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి హైటెక్స్‌లో గ్రీన్ ప్రాపర్టీషో ముగింపు వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విక్రమార్క మాట్లాడుతూ.. పెట్టుబడులకు హైదరాబాద్ స్వర్గధామంగా ఉన్నదని, రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం పూర్తయితే పట్టణ రాష్ట్రంగా తెలంగాణ రూపుదిద్దుకుంటుందని చెప్పారు. రాష్ట్రంలోని పంచాయతీలు, మున్సిపాలిటీల్లో మౌలిక వసతులను, వ్యర్థాల నిర్వహణను మెరుగుపర్చడంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఐజీబీసీ సభ్యులు, పలువురు బిల్డర్లు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

న్యాయం చేయాలంటూ నినాదాలు చేస్తున్న ఫ్లాట్ ఓనర్స్

ఫ్లాట్లపై అక్రమంగా రుణం తీసుకున్న బిల్డర్

- ఫ్లాట్ యజమానుల ఆవేదన
- ప్రభుత్వం న్యాయం చేయాలని విజ్ఞప్తి

ఖైరతాబాద్, మే 19 : కోట్లు చెల్లించి కొనుగోలు చేసిన ఫ్లాట్లపై ఓ బిల్డర్ అక్రమంగా భారీ ఎత్తున రుణం తీసుకున్నాడని మియాపూర్‌కు చెందిన పలువురు ఫ్లాట్ యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేఎస్ఆర్ టుగెదర్మెంట్స్ ఫ్లాట్స్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు జనార్దన్ రెడ్డి, రాజా, ప్రభావతి, పవన్ కుమార్‌లు మాట్లాడుతూ 2019 నుంచి 2021 మధ్య సదరు అపార్ట్‌మెంట్‌లో సుమారు 150 మంది రూ.1.50 కోట్ల నుంచి రూ.2కోట్ల వరకు చెల్లించి ఫ్లాట్లను సొంతం చేసుకున్నామని తెలిపారు. ఫ్లాట్ల కొనుగోలుకు ముందు సోలార్ విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని, అత్యాధునిక సౌకర్యాలు ఉంటాయని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. తీరా ఫ్లాట్లు కొన్నాక ఫైర్ అలార్మింగ్ సిస్టమ్ లేదని, గ్రీనరీ, ఐల్యాండ్లు కట్టలేదని, పార్కింగ్ విషయంలోనూ తక్కువ మందికి అనుమతి తీసుకొని ఎక్కువ మందికి విక్రయించాడని ఆరోపించారు. తాజాగా పలు ఫ్లాట్లను తనఖా పెట్టి ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో రూ.60కోట్లు రుణం తీసుకున్నట్టు తెలిసిందని, ఈ విషయమై తాము 14 సార్లు మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేసినా కనీసం ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదన్నారు. ఇదేంటని నిలదీస్తే తమపై దాడులు చేయిస్తానంటూ బెదిరిస్తున్నాడని, ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

పెట్రోల్ బంకులో లారీకి మంటలు



యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలోని నయారా పెట్రోల్ బంకుకు ఆదివారం వచ్చిన లారీ డీజిల్ ట్యాంక్ ఒక్కసారిగా పగిలిపోవడంతో మంటలు ఎగిసిపడ్డాయి. పెట్రోల్ బంకు సిబ్బంది వెంటనే అప్రమత్తమై ఫైర్ సిలిండర్ల సహాయంతో మంటలను ఆర్పివేశారు. ఒక్కసారిగా వచ్చిన మంటలతో పెట్రోల్ బంకులోని వాహనదారులు భయంతో పరుగులు తీశారు. పెను ప్రమాదం తప్పడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. – భువనగిరి కలెక్టరేట్

ఐదు వేల కోట్ల కమీషన్

మొదటిపేజీ తరువాయి...

స్ట్రాంగ్, లైట్, నాకౌట్, బడ్వైజర్, ఆఫీసర్స్ చాయిస్, కర్జూరా, కూల్‌బర్గ్, 5000, రాయల్‌స్టాగ్, టోబర్గ్ వంటివి ఉన్నాయి. మద్యం కంపెనీలకు డబ్బులు చెల్లించకుండా, ఎన్నికల కోడ్‌ను బూచిగా చూపి, కావాలనే కొందరు మద్యం కొరత సృష్టిస్తున్నట్టు తెలిసింది. దీనివెనుక మద్యం సరఫరాలో ప్రస్తుతం లీడింగ్‌లో ఉన్న ఓ మంత్రి తమ్ముడి హస్తం ఉన్నదని తెలిసింది. మద్యం దుకాణాలు బేవరేజ్ కార్పొరేషన్‌కు చలాన్లు కట్టినా, ఇండెంట్లు పెట్టినా మద్యం సరఫరా చేయడంలో విముఖత చూపుతున్నారని సమాచారం. అయితే, డిమాండ్ దృష్ట్యా ఇండెంట్లు ఒక బ్రాండ్‌కు పెడుతుంటే.. వారు కావాలని మరొక బ్రాండ్ సప్లయ్ చేస్తున్నట్టు తెలిసింది. మద్యానికి బానిసైన వ్యక్తికి నాలుగైదు రోజుల పాటు అతను తాగే బ్రాండ్‌ను ఆపేస్తే.. ఇక అతనితో ఏదైనా తాగించవచ్చనే కుయుక్తులు పన్నుతున్నారు.

కమీషన్ ఇచ్చే బ్రాండ్‌లకే ప్రమోషన్

తెలంగాణలో అనధికారికంగా రూపొందించిన మద్యం పాలసీ ప్రకారం తమకు అధికశాతం కమీషన్ ఇచ్చిన బ్రాండ్‌లకే ప్రభుత్వ పెద్దలు అంగీకారం తెలుపనున్నారని సమాచారం. ఈ క్రమంలోనే ఇటు బీర్లు, అటు ఆల్కహాల్ బ్రాండ్ల కృత్రిమ కొరత సృష్టించారని స్పష్టంగా అర్థమవుతున్నదని పరిశీలకులు చెప్తున్నారు. తమ బ్రాండ్ మద్యం జనాల్లోకి వెళ్లాలంటే తప్పనిసరిగా కమీషన్ చెల్లించాల్సిన పరిస్థితి. ఈ వ్యూహంలో భాగంగానే కొత్త మద్యం బ్రాండ్‌లను తెలంగాణలో ప్రవేశపెడతారని తెలిసింది. ఈ కొత్త బ్రాండ్‌ల ఎంట్రీలో కూడా ఎవరు ఎంత ఎక్కువ కమీషన్ ఇస్తే వారి సరుకుకే ప్రమోషన్ ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ అనధికారిక నియంత్రణ, కమీషన్ల ద్వారా ఒక్కో ఏడాదికి సుమారు రూ.5వేల కోట్ల నగదు చేతులు మారుతుందని మద్యం వ్యాపార వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ఈ వ్యూహాత్మక ఎత్తుగడలో ఓ రాజకీయ నాయకుడి పాత్ర చాలా కీలకంగా ఉన్నట్టు తెలుస్తున్నది. పనిలో పనిగా మద్యం ధరలు కూడా పెంచే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు సమాచారం.

తెలంగాణలో నాడు డిమాండ్‌కు తగ్గ సప్లయ్

తెలంగాణలో పుట్టుక నుంచి చావు వరకూ కార్యక్రమం ఏదైనా 'మందు' ఉండాల్సిందే. తెలంగాణలో గత ప్రభుత్వాలు డిమాండ్‌కు తగ్గట్టు జాగ్రత్తగా సప్లయ్ చేశాయి. బీఆర్ఎస్ హయాంలో ఓ క్రమపద్ధతిలో మద్యం అమ్మకాలకు పరిమితులు విధించి, నాణ్యమైన, అందరికీ ఆమోదయోగ్యమైన మద్యాన్ని విక్రయించారు. ఎక్సైజ్‌శాఖకు సైతం అమ్మకాలు, కొనుగోళ్లు, డిమాండ్‌కు తగిన సప్లయ్ విషయంలో ఎలాంటి పరిమితులు పెట్టకుండా ఫ్రీహ్యాండ్ ఇచ్చారు. కాగా ఎన్నికల వేళ మద్యం డిమాండ్ అత్యధికంగా ఉండటంతో కొందరు ప్రభుత్వ పెద్దలకు ఇదొక అక్రమార్జన మార్గంగా కనిపించింది. దీంతో కావాలనే కొన్ని ఆల్కహాల్ బ్రాండ్‌లను తొక్కిపెడుతున్నారు. అనధికారికంగా కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. ఈ కొత్త విధానంతో ఉత్పత్తి చేసే వారు, డిస్ట్రిబ్యూట్ చేసేవారు, విక్రయించే వారు అంతా సిండికేట్ అయితే.. ఇక అడ్డూ అదుపు ఉండదని మద్యం వ్యాపారులే చర్చించుకుంటున్నారు.

థింపూలో ఏబీటీవో ఆఫీస్ ప్రారంభం

హైదరాబాద్, మే 19 (నమస్తే తెలంగాణ): భూటాన్ రాజధాని థింపూలో 'అసోసియేషన్ ఆఫ్ బుద్దిస్ట్ టూర్ ఆపరేటర్స్' (ఏబీటీవో) కార్యాలయాన్ని ఆ సంస్థ ఉపాధ్యక్షుడు మల్లేపల్లి లక్ష్మయ్య ప్రారంభించారు. ఆసియా హైవే అందుబాటులోకి రానున్న నేపథ్యంలో బంగ్లాదేశ్, భూటాన్, ఇండియా, నేపాల్, మయన్మార్ దేశాల్లో బౌద్ధ పర్యాటక స్థావరాలను అధిక సంఖ్యలో సందర్శించేలా వ్యూహాలను సిద్ధం చేసి, ప్రభుత్వాల మధ్య సమన్వయాన్ని పెంపునకు తమ సంస్థ కృషి చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఏబీటీవో ప్రధాన కార్యదర్శి కౌలేశ్ కుమార్, సీనియర్ సంపాదకులు కే రామచంద్ర మూర్తి, ఎగ్జాటిక్ ఈవెంట్ అధినేత కేకే రాజా, బుద్ధవనం కన్సల్టెంట్ ఈమని శివనాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు ట్రాన్స్‌జెండర్ల మృతి

- ఏపీలోని కర్నూలు జిల్లాలో ఘటన

హైదరాబాద్, మే 19 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలో ముగ్గురు ట్రాన్స్‌జెండర్లు అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. కర్నూలు సమీపంలోని గార్గేయపురం చెరువు వద్ద ఇద్దరి మృతదేహాలను స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించగా చెరువు ఒడ్డున మరో మృతదేహాన్ని వారు గుర్తించారు. మృతదేహాలను శవపరీక్ష నిమిత్తం కర్నూలు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతదేహాలను గుర్తుపట్టేందుకు ట్రాన్స్‌జెండర్లను పోలీసులు రప్పించారు. మృతదేహాలపై గాయాలు లేకపోవడంతో వారి మరణం మిస్టరీగా మారింది.

కన్నబిడ్డకే ఉరేశారు

- మతిస్థిమితంలేదని హతమార్చిన తల్లిదండ్రులు
- ఈనెల 14న సిరిసిల్ల జిల్లా నేరెళ్లలో ఘటన
- ఆలస్యంగా వెలుగులోకి

ప్రియాంక (ఫైల్)

సిరిసిల్ల రూరల్, మే 19: ఏడేండ్లుగా మానసిక రుగ్మతతో బాధపడుతున్న కూతురికి లక్షలు వెచ్చించి దవాఖానల్లో చికిత్స చేయించారు. ఇంతలో వ్యాధి కొంతమేర నయంకావడంతో పెండ్లి చేశారు. నెల కిందట వ్యాధి తిరగబెట్టి భర్త, కొడుకును కొట్టడం, చుట్టుపక్కల వారితో తరచూ గొడవ పడుతుండటంతో విసిగిపోయిన తల్లిదండ్రులు నిద్రిస్తున్న కూతురికి ఉరేసి చంపేశారు. సిరిసిల్ల జిల్లాలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్పీ అఖిల్‌మహాజన్ ఆదివారం మీడియాకు వెల్లడించిన వివరాల ప్రకారం... సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం చెప్యాల ఎల్లవ్వ-నర్సయ్య దంపతుల కూతురు ప్రియాంక (27) ఏడేండ్లుగా మానసిక సమస్యతో బాధపడుతున్నది. తల్లిదండ్రులు ప్రియాంకకు పలు దవాఖానల్లో చికిత్స చేయించారు. అనేక ఆలయాలకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో వ్యాధి నయం కావడంతో 2020లో సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం దర్గపల్లికి చెందిన వ్యక్తితో వివాహం జరిపించారు. వీరికి 13 నెలల బాబు ఉన్నాడు. వీరు కరీంనగర్‌లో నివాసం ఉంటున్నారు. ఇక కూతురు కాపురం సజావుగా సాగుతుందనుకుంటున్న తరుణంలో నెల క్రితం ప్రియాంకకు వ్యాధి తిరగబెట్టింది. అప్పటినుంచి ఆమె చుట్టుపక్కల వారిని దూషిస్తూ గొడవపెట్టుకొంటుంది. భర్తతో పాటు 13 నెలల బాబుపైనా దాడి చేస్తున్నది. భర్త.. ప్రియాంక పరిస్థితిని వారి తల్లిదండ్రులకు తెలిపాడు. వారు కరీంనగర్‌కు వచ్చి దవాఖానలో చికిత్సచేయిస్తామని కూతురిని ఇంటికి తీసుకెళ్లారు. తరువాత ప్రియాంకను స్థానిక బుగ్గ రాజేశ్వరస్వామి ఆలయానికి తీసుకెళ్లి అక్కడ మూడు రోజులపాటు ఉంచారు. అయినప్పటికీ ప్రియాంక విపరీత చేష్టల్లో మార్పురాలేదు. ఈనెల 14న రాత్రి ఒంటి గంటకు ఇంట్లో నిద్రిస్తున్న కూతురిని నూలు దారంతో ఉరేసి చంపేశారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అందించిన సమాచారం మేరకు భర్త.. ప్రియాంక మృతదేహాన్ని నంగునూరుకు తీసుకెళ్లి అంత్యక్రియలు చేశారు. స్థానికంగా ఉన్న ఓ వ్యక్తి ప్రియాంక మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ డయల్ 100కు ఫోన్ చేశాడు. రంగంలోకి దిగిన పోలీసులు చుట్టుపక్కల వారిని విచారించారు. వారిచ్చిన సమాచారం మేరకు ప్రియాంక తల్లిదండ్రులు నర్సయ్య-ఎల్లవ్వను అదుపులోకి తీసుకొని విచారణ చేయగా నేరాన్ని అంగీకరించారు. పోలీసులు హత్యకు ఉపయోగించిన నూలు దారాన్ని స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్‌కు తరలించారు.

నేడు కోర్టుకు ఎమ్మెల్సీ కవిత

ఈడీ, సీబీఐ కేసుల్లో ముగియనున్న కస్టడీ



హైదరాబాద్, మే 19 (నమస్తే తెలంగాణ): ఢిల్లీ లిక్కర్ పాలసీకి సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), సీబీఐ నమోదు చేసిన కేసుల్లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సోమవారం కోర్టులో హాజరుకానున్నారు. ఈ కేసుల్లో కవితకు విధించిన జ్యుడిషియల్ కస్టడీ సోమవారంతో ముగియనుండటంతో మధ్యాహ్నం 2 గంటలకు ఆమెను ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపరిచే అవకాశం ఉన్నది. అయితే కవితను కోర్టులో భౌతికంగా హాజరుపరుస్తారా? లేక వర్చువల్‌గా హాజరుపరుస్తారా? అన్న అంశంపై ఇంకా స్పష్టత రాలేదు. దీనిపై అధికారులు సోమవారం నిర్ణయం తీసుకోనున్నారు. మార్చి 26 నుంచి కవిత జ్యుడిషియల్ కస్టడీలో ఉన్న విషయం విదితమే.

కేంద్రంలో బీజేపీ ఓడిపోతుంది

సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ



హైదరాబాద్, మే 19 (నమస్తే తెలంగాణ): ఆమ్ ఆద్మీ, కాంగ్రెస్ పార్టీలు కలిసి పోటీ చేస్తే బీజేపీ ఓటమి పాలవుతుందని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీలో ప్రభుత్వం మారుతుందని చెప్పారు. అవినీతిని ఎన్నిరకాలుగా చేయవచ్చో జగన్‌మోహన్‌రెడ్డి వద్ద నేర్చుకోవాలని, చంద్రబాబు నాయుడు స్వార్థ రాజకీయాల కోసమే మోదీతో కలిశారని విమర్శించారు. గుజరాత్‌లోని ముందనార్ పోర్టు నుంచి గంజాయి, డ్రగ్స్ సరఫరా అవుతున్నాయని ఆరోపించారు.